# శిక్ష

అంతా కన్నుమూసి తెరిచేలోగా జరిగిపోయింది. ఇలా జరుగుతుందని నేను కలలో కూడా అనుకోలేదు. ప్రపంచంలో ఇంత దగా, ఇంత మోసం ఉంటుందని నేనెన్నడూ ఊహించలేదు. నేను ఇలాంటి కుట్రలో ఇరుక్కుంటానని, నా జీవితం ఇలాంటి మలుపు తిరుగుతుందని నేనెన్నడూ అనుకోలేదు.

బి.ఏ పరీక్షలు రాసి వేసవి సెలవులకు మా ఊరొచ్చాను. మా ఊళ్లో నాకెప్పుడూ చాలా సరదాగానే గడుస్తుంది. మా నాన్న మా వూరికి సర్పంచ్. మాది చాలా హోదా, పలుకుబడి ఉన్న కుటుంబం - ఒకప్పుడు మా నాన్నంటే మా ఊరివాళ్లంతా హడలిపోయేవాళ్లు (అఫ్‌కోర్స్... ఇప్పుడుకూడా మా నాన్నంటే హడలే అనుకోండి)

ఆ రోజుల్లో మా నాన్న ఊరికి ఏడెనిమిది మైళ్ళ దూరంలో వుండే పాలకుర్తి జమీందారుగారి దగ్గర గుమస్తాగా పనిచేసేవాడు. మా వూళ్లో భూములన్నీ పాలకుర్తి జమీందారుగారివే. వాటిమీది పెత్తనమంతా మా నాన్నగారిదే మా నాన్న మావూరి దొరగార్కి గుమాస్తా కాబట్టి మా నాన్నను కూడా అందరూ దొరలాగే చూసేవాళ్లు. ఆ తర్వాత పరిస్థితులు మారటం, కమ్యూనిస్టుల పోరాటం రావడం, జమీందారి విధానం పోవటం. ఏవో భూసంస్కరణలంటూ రావటం... పాపం.... మా దొరగారు తన భూములన్నీ హడావుడిగా అమ్మేయడం (దొరగారు అమ్మిన భూముల్లో చాలావరకు మా నాన్నగారి ద్వారానే అమ్మారనుకోండి) మొత్తానికి ఈ పరిణామాలు తలఎత్తిన కొత్తలో మా నాన్నగార్కి, మా కుటుంబానికి చాలా గడ్డురోజులే వచ్చాయనిపించింది. కాని త్వరలోనే మా నాన్నగారు మళ్లీ పుంజుకున్నారు. పంచాయతీ రాజ్యం రావటంతో మా నాన్నగారు జారిపోయిన తన పూర్వపు అధికారాన్ని తిరిగి నిలబెట్టుకోగల్గాడు - ఓట్లను కొన్నాడు - ఆ తర్వాత పంచాయతీ మెంబర్లను కొన్నాడు - సర్పంచ్ అయ్యాడు.

చిన్నప్పట్నుంచి నాక్కూడా మా నాన్నలాగే అందరిమీద అధికారం చెలాయించాలన్న కోరిక ఉండేది. చదువుమీద పెద్ద మోజేమీ ఉండేది కాదు. కాని నాన్న వెళ్లమంటున్నాడు గదా అని వెళ్లేవాడిని... ప్రత్యేక తెలంగాణా ఉద్యమం వచ్చిన రోజుల్లో పుస్తకాలు చూసి పరీక్షలు రాయటమే కాబట్టి ఏడో తరగతి, ఇంటర్మీడియెట్ సులభంగానే గట్టెక్కాను. కాని బి.ఎ థర్డియర్ వచ్చేటప్పటికి పరిస్థితి అకస్మాత్తుగా మారింది. ఎమర్జన్సీ అన్నారు - వైస్ చాన్సలర్ మారాడన్నారు. ఇదివరకు మేకపిల్లల్లా కనిపించే లెక్చరర్లంతా పులులై పోయారు.

మా పరిస్థితి చూస్తే నేను జన్మలో బి.ఎ ప్యాసు కాననిపించింది. ఆన్సర్ బుక్స్‌లో ఒక్క పేజీకూడా ఖరాబు చెయ్యకుండా శుభ్రంగా తిరిగి యిచ్చేసి ఎలాగో పరీక్షలయి పోయాయనిపించి మా ఊళ్లో వచ్చిపడ్డాను.

మా ఊళ్లో మాకో పెద్దమామిడి తోటుంది. చాలా భూములున్నాయి. (మొన్న వచ్చిన ల్యాండ్ సీలింగ్‌లో మాది ఒక్క సెంటు భూమి కూడా పోకుండా మా నాన్న అన్ని కట్టుదిట్టాలు చేశాడు). మా ఊళ్లో నాకు చాలామంది ఫ్రెండ్స్ ఉన్నారు. అందరమూ సరదాగా మామిడి తోటలోకి వెళ్లేవాళ్లం... ఎవరింట్లోనైనా పేకాట వేసే వాళ్లం... మా ఫ్రెండ్స్‌లో నరసింహస్వామి ఎప్పుడూ భలేగా కబుర్లు చెప్తుండేవాడు. వాడిని మేము ఎప్పుడూ ''స్వామి'' అని పిలిచేవాళ్లం. స్వామికి మా ఊళ్లో వున్న అందమైన ఆడపిల్ల లందరూ తెలుసు సరిగ్గా ఆ రోజుల్లోనే నాలో ఆడవాళ్లంటే విపరీతమైన మోజు ఏర్పడింది. ప్రతిరోజూ మంచినీళ్ల బావిదగ్గర కెళ్లి కూర్చునేవాళ్లం... రోజూ సాయంత్రం మా ఊళ్లోని ఆడవాళ్లంతా మంచినీళ్ల కోసం ఆ బావి దగ్గరికొచ్చి నీళ్లు చేదుకొని వెళ్తుండేవాళ్లు. ఆడవాళ్లకేసి అదేపనిగా చూడటం, వాళ్లను గూర్చి ఏదేదో ఊహించుకోవడం... రాత్రిళ్లు ఇలాంటి ఊహలతో నా శరీరమంతా వేడెక్కి ఏదో భరించలేని బాధతో తల్లడిల్లిపోవడం... ఇంత రంపపు కోతను అనుభవిస్తున్న నాకు పిచ్చెక్కి పోతుందేమోననిపించేది.

మా నాన్న, అమ్మా నాకు పెళ్లి చేయాలని ఆలోచిస్తున్నారని నాకు తెలుసు. కాని మా నాన్న ఆశించినంత కట్నం యివ్వటానికింకా ఎవ్వరూ ముందుకు రావడం లేదు. అందుకే నా పెళ్లి వాయిదా పడిపోతున్నది.

ఓరోజు నా బాధంతా నరసింహస్వామితో చెప్పుకున్నాను.

''నీ బాధ నాకు తెలుసులేరా - నీకు దమ్ముంటే నేనో చోటికి తీసుకుపోతాను వస్తావా?'' అన్నాడు స్వామి.

''ఎక్కడికిరా...'' అన్నాను. ఎందుకో నా గుండెలు వణికాయి. వాడెక్కడికి తీసుకువెళ్తాడో నాకు తెలుసు.

''ఈ ఊరికో కొత్త పిట్టొచ్చింది. మీ జీతగాడు వీరిగాడు తెలుసుగా, వాడీ మధ్యనే పెళ్లి చేసుకున్నాడు. వాడి పెళ్లాం చంద్రి... భలేగుంటుందిలే. అది ఈ ఊరు రాగానే వ్యాపారం మొదలెట్టింది''

''దాని మొగుడు ఊరుకుంటున్నాడా?''

''ఊరుకోక ఏం చేస్తాడు? వాడికి దాన్ని యేమన్నా అనటానికి తీరికెక్కడ. 24 గంటలూ మీ ఇంట్లోనే చాకిరీ చేస్తున్నాడాయె. పైగా వాడు పెళ్లాం కావాలని పదేళ్లనుండీ తిరుగుతోంటే ఇది దొరికింది. దీన్ని యేమన్నా అన్నాడంటే ఇది వెళ్లిపోతుంది. వాడికి మళ్లీ పెళ్ళి కావాలంటే పరో పదేళ్లు తిరగాలి. మన మధ్యతరగతి కుటుంబాల్లోలాగా పని చేసుకుని బతికేవాళ్లలో పెళ్లాలు, భర్తలకు అడుగులకు మడుగులొత్తుతూ కూర్చోరు. మన

దగ్గర భర్త వెళ్ళిపొమ్మంటే భార్యకు వేరే గతిలేదు గదా. కాని వాళ్ళల్లో స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం ఉంది. అందుకే వాళ్ళు మన స్త్రీలలాగా భర్తలకు బానిసలుగా బతకరు. ఇష్టం లేకపోతే మొగుడ్ని వదిలేసి చక్కా పోతారు. మరొకడ్ని కట్టుకుంటారు.''

''సరే నీ ఉపన్యాసం చాలు కానీ... యేం చేద్దామంటావో చెప్పు'' అన్నాను.

''చెప్పానుగా చెంద్రి దగ్గరకు వెడదాం పద... ఈ రాత్రికే...''

''మా నాన్నకు తెలిస్తే...''

స్వామి గొల్లున నవ్వాడు.

''మీ నాన్నకి తెలిస్తే మావాడు బాగా ప్రయోజకుడౌతున్నాడని సంతోషిస్తాడు. తన అడుగుజాడల్లో నడుస్తున్నాడని మురిసిపోతాడు. మీ నాన్న ఇప్పటికి ఇలాంటి షికార్లు వెళ్తుంటాడోయ్ చిట్టినాన్న. ఈపాటికి చంద్రి దగ్గరక్కూడా వెళ్లి ఉంటాడు''

''అమ్మబాబోయ్... అయితే మనం చంద్రి దగ్గరకు వెళ్ళొద్దు.... కొంపతీసి అక్కడికే మా నాన్న కూడా వస్తే...''

''పోరా పిరికి సన్యాసి. నీకేమి ప్రమాదం రాకుండా నేను చూసుకుంటాను గానీ ఓ పది రూపాయలు జేబులో వేసుకునిరా పో...'' అన్నాడు స్వామి.

* * *

ఆనాటినుండి చంద్రి దగ్గరికి రోజూ వెళ్తుండేవాడిని. ఆరోజు నేను చంద్రి కలిసి ఉండగా వీరిగాడు రానేవచ్చాడు. పెద్దగొడవైపోయింది. వాడు దాన్ని బాగా కొట్టాడు. నేను తప్పించుకుని బయటకు పరుగెత్తాను. అంతే... చంద్రి వాళ్ళ ఊరు వెళ్లిపోయింది. అది మళ్లీ తిరిగి రాలేదు. నాకు మళ్లీ పిచ్చెక్కడం ప్రారంభమైంది. చంద్రి వాళ్ల ఊరు వెడదామనుకున్నాను. ''మన ఊళ్ళో యేం చేసినా ఫరవాలేదు. యేదన్నా ప్రమాదమొస్తే ఆదుకోవటానికి చెట్టంత మీ నాన్న ఉన్నాడు... పరాయి ఊరికి పోతేఁ మక్కెలిరగ తంతారు... జాగ్రత్త'' అని హెచ్చరించాడు స్వామి.

సరిగ్గా ఈ రోజుల్లోనే మరో సంఘటన జరిగింది.

''మామిడి చెట్ల దగ్గర ఎవరూ లేరు. వాడో వీడో వచ్చి కాయలు కొట్టుకుపోతారు... కాసేపు అక్కడికెళ్లి కూర్చో. ఎవడినైనా జీతగాణ్ణి పంపించేదాకా అక్కడే ఉండు'' అన్నాడు నాన్న.

ఎండలో మామిడి తోటకు బయల్దేరాను. ఊళ్లోంచి మామిడితోట వెళ్లడానికి ఓ 20 నిమిషాలు పడుతుంది. ఎక్కడా జనసంచారం లేదు.

తోట సమీపించేటప్పటికి మా నాన్న అన్నట్టు ఎవరో మామిడికాయలు కోస్తున్నట్టుగా కనిపించింది. వేగంగా నడిచాను.

ఒక్కతె అమ్మాయి... మా ఊళ్లో ఆ అమ్మాయిని నేనెప్పుడూ చూళ్లేదు... రాళ్లతో

మామిడికాయలు కోస్తోంది. ఏడెనిమిది కాయలు కొట్టి ఒకచోట కుప్పపోసింది. ఆ అమ్మాయి మా కుటుంబ సర్వస్వాన్నంతా దోచుకుపోతున్నంత కసి పుట్టింది నాలో. అది ఆడదై బతికిపోయింది. మగవాడైతే వళ్లు చిట్లిపోయేలా బాదేవాడిని - మా నాన్న దొరగారి గుమస్తాగా పనిచేసిన రోజుల్లో ఇలాంటివాళ్ల నెందర్లో చితకబాదేవాట్ట. మా ఇంట్లో మా నాన్నగారి ఈ ఘనకార్యాలను కథలుగా చెప్పుకుంటారు. అది విన్నప్పుడల్లా నేను కూడా నాన్నగారి లాగా మా ఆస్తిమీద చెయ్యివేసిన వాళ్లను కసితీరా బాది నా ప్రతాపాన్ని చూపిస్తే బావుండును అనిపించేది. అలాంటి అవకాశం నాకిప్పుడు కలిగింది.

''ఏయ్ - ఎవ్వత్తివే నువ్వు. మా చెట్లకాయలు కోస్తున్నావు. చంపేస్తాను. ఏమనుకున్నావో-'' అన్నాను వగురుస్తూ...

ఆ అమ్మాయి నాకేసి ఉలిక్కిపడి చూసింది. ''ఈ చెట్లు మీయా దొర?'' అంది.

ఆ అమ్మాయి నాకేసి తిరిగేటప్పటికి నా కళ్లను నేను నమ్మలేకపోయాను. కొంచెం నల్లగా ఉన్నా, ఆ అమ్మాయి ఎంతో అందంగా ఉంది. చక్కని కళ్లు, ముక్కు విశాలమైన నుదురు, కోలమొహం, ఆమె అంగాంగంలో అప్పుడే చోటుచేసుకుంటున్న యౌవనం, ఓ ముతక జాకెట్టు, ముతక చీరలో కూడా ఆ అమ్మాయి ఎంతో అందంగా కనిపించింది.

''ఔను... మాదే... నీకు తెలీదా?'' ఆడదానివై బతికిపోయావు... లేకపోతే...''

''లేకపోతే?'' అందా అమ్మాయి కనుబొమలెగరేస్తూ.

''వళ్లు చీరేసేవాడ్ని... ప్రాణం తీసేవాడిని''

ఆ అమ్మాయి భయపడుతున్నట్టుగా నటించింది. మామిడికాయలు తన పమిటకొంగులో మూటకట్టింది. కొన్ని క్షణాల వరకు ఆ అమ్మాయి అంగవిన్యాసం కేసి చూస్తూ మతిపోయిన వాడిలా నిల్చున్నాను. ఎందుకో నా బుర్ర చురుగ్గా పనిచెయ్యసాగింది. చుట్టుపక్కల ఎవరూ లేరు... గుబురుగా ఉన్న మామిడితోట... నా ముందు ఓ అందమైన పడుచు... కొంచెం ప్రయత్నం చేస్తే...

''ఏయ్... ఆగు...'' అన్నాను. వెళ్లబోతున్న ఆ అమ్మాయి ఆగింది.

''మామిడికాయలు మూటకట్టుకుని పోవడానికి ఎవరి సొమ్మనుకున్నావు?''

''ఈ ఒక్కసారికి వదిలేయండి దొర'' అందామె బ్రతిమాలుతున్నట్టుగా.

''వదిలేస్తే ఏమిస్తావు'' ఈ మాట నా నోట్లోంచి అప్రయత్నంగా వెలువడింది.

''పేదోళ్లం... ఇవ్వడానికి మా దగ్గర ఏముంటాది దొరా?''

''ఉన్నవే ఇవ్వమంటున్నా''

''నా దగ్గరేముంది దొరా?''

''అందం... యౌవనం''

''పెద్దింటోరు... చదువుకున్నోరు... మీరే...''

''పెద్దింటోరికి కోరికలుండవా?''

''కోరికలుంటే పెళ్లి చేసుకోండి''

''ఎవర్ని చేసుకోమంటావు? నీ అంత అందమైన అమ్మాయి దొరుకుతుందా?''

''మీ కంటికి నేనంత అందంగా కనబడ్తే నన్నే చేసుకోండి'' అంటూ ఆ అమ్మాయి కిసుక్కున నవ్వింది.

ఒక్కసారి అదిరిపోయాను. నా బుర్ర స్తంభించిపోయింది. అమాయకంగా కనిపించే ఈ అమ్మాయిలో ఎంత సాహసం!

కథా నిలయం
3725
శ్రీకాకుళం

''నీ పేరేమిటి? కొంచెం తేరుకున్నాక అడిగాను.

''రాధ''

''చాలా మంచి పేరే... మీది ఈ ఊరేనా?''

''ఔను...''

''మీ నాన్న పేరు...''

''చంద్రయ్య... అందరూ చంద్రుగాడు అంటారనుకోండి..''

''ఓ చంద్రుగాడా... తెలుసు... మీరు మాదిగోళ్ళన్న మాట...'' షాకైపోయాను.

''అన్నమాటేగా!''

''మరి నువ్వెప్పుడు ఈ ఊళ్ళో కనిపించలేదేమిటి?''

''జనగాంలో చదువుకుంటున్నాను''

''చదువుకుంటున్నావా? తిండికే లేని మీ నాన్న చదివిస్తున్నాడా?''

''మాకు స్కాలర్‌షిప్పు దొరుకుతుంది...''

''మీరే నయం. ఈ దేశంలో మీకున్నన్ని సౌకర్యాలు ఎవరికున్నాయ్ - యేం చదువుతున్నావు?''

''ఇంటర్మీడియెట్...''

''ఇంటర్మీడియెట్... వండర్‌ఫుల్... వండర్‌ఫుల్... అందుకే ఇలా మాట్లాడుతున్నావ్!''

''ఎలా మాట్లాడుతున్నాను...''

''చాలా చక్కగా... ఈ మామిడికాయ లేం చేసుకుంటావు?''

''మా అయ్య - అదే మా నాన్న తెమ్మన్నాడు... పులుసు చేసుకోవడానికి...''

''ఈ సమయంలో అయితే ఎవరూ కాపలా ఉండరు వెళ్లమన్నాడు... ఔనా?''

''ఔను... చాలా థాంక్స్...''

''ఎందుకు?''

''మామిడికాయలు తీసుకువెళ్లడానికి పర్మిషన్ ఇచ్చినందుకు...''

''నే నడిగిందెప్పుడుగా నేను పర్మిషన్ ఇవ్వటానికి''

''నేనడిగింది మీరిచ్చారా?''

క్షణంసేపు ఆలోచించాను...

''నువ్వంటే నాకు చాలా ఇష్టం... నిన్ను ప్రేమించాను రాధా... మొదటి చూపులోనే ప్రేమించేశాను... నువ్వన్నట్టు నిన్ను పెళ్లి చేసుకుంటాను కూడా...!'' ఆమె దగ్గరగా వెళ్లి ఆమె చెయ్యి పట్టుకున్నాను. ఆమె నా కోరిక తీర్చదు. అందుకే అప్రయత్నంగా ఆ మాట నానోట్లోంచి వెలువడింది. పెళ్ళి చేసుకుంటానంటే తప్ప ఆమెలో చలనం లేదు.

''చాలా సాహసమే చేశారు...''

''యేం సాహసం చేశాను?''

''ఇలా నా చెయ్యి పట్టుకోవడం''

''ఎందుకు?''

''మేం అంటరానివాళ్లమన్న సంగతి మరచిపోయారు...''

''ఛఛ! నాకలాంటి పట్టింపులేమీ లేవు...''

''కావాలంటే నిన్ను ముద్దు కూడా పెట్టుకుంటాను...'' నన్నేదో వెర్రి ఆవేశం ఆక్రమించుకుంది. యేదో పిచ్చి ఆవేశంతో ఆమె పెదవుల్ని ముద్దు పెట్టుకున్నాను. ఆమె స్పర్శ నా నరనరాల్లో ప్రవహింపజేసింది. నా శరీరం నా వశంలో లేదు.

రాధను గట్టిగా నా హృదయానికి హత్తుకోబోయాను. ఆమె అడ్డు చెప్పకపోవడం నన్నింకా రెచ్చగొట్టింది.

ఆమె మెల్లగా వెనక్కి జరిగింది. ''ఈ సంగతి మీ నాన్నకు తెలిస్తే''

''డోన్ట్‌కేర్... మా నాన్నంటే భయపడటానికి నేనేమన్నా చిట్టిపాప ననుకున్నావా?''

''మీ నాన్నంటే భయం లేదన్నమాట''

''నిజంగా... అలా వెడదాం పద రాధా''

ఎలా వెడదాం?''

''అదిగో... ఆ గుడిసెలోకి... ఆ తోటకు కావలి ఉండటానికి ఓ గుడిసె వేయించాం''

నా భావాన్ని ఆ అమ్మాయి గ్రహించింది.

''అలా కాదు... ఇలా వెడదాం రండి...'' అంటూ రాధ ఊరివైపు దారితీసింది.

''ఎందుకు?''

''మా ఇంటికి వెడదాం పదండి..''

''ఇలా పట్టపగలు... మీ ఇంటికెడ్తే అందరూ చూస్తే...''

''చూస్తే యేం... మనం ప్రేమించుకున్నాంగా?''

''అఫ్‌కోర్స్... ఇప్పుడు కాదు మరో సారెప్పుడైనా...''

''పోనీయ్ ఈ రోజు రాత్రికి వస్తారా?''

ఒక్కసారి నా గుండెలు భయంకరంగా కొట్టుకున్నాయి. మైగాడ్... ఈ అమ్మాయిలో ఎంత సాహసం! ఇంటికే రమ్మని పిలుస్తోంది.... యే మగాడైనా నా పిలుపును కాదన గలడా?

''రాత్రికా? ఎన్నింటికి?''

''పదింటికి... అందరూ పడుకున్నాక...''

''మీ ఇంట్లో మీ నాన్నా, అమ్మా...''

''మా నాన్న ఈ రాత్రికి ఉండటం లేదు. కావలి వెళ్తున్నాడు... మా అమ్మ చిన్నప్పుడే చనిపోయింది. మీకు తెలియదేమో! ఇక మా అన్నయ్య ఇంకా వరంగల్ నుండి రానేలేదు''

''మీ అన్నయేం చేస్తాడు''

''వరంగల్‌లో బి.ఎ చదువుతున్నాడు''

''అబ్బా... మీ అన్నకు కూడా స్కాలర్‌షిప్''

''ఔను... స్కాలర్‌షిప్ లేకుండా మేమెలా చదవగలమండి''

''మీ నాన్న చాలా గొప్పపని చేశాడే''

''నేను వెడతాను... రాత్రికి నిజంగా వస్తారా?'' ఆ మాట అంటున్నప్పుడు రాధ అందంగా సిగ్గుపడింది. ఆమె కళ్లలో ఏదో గొప్ప వెలుగు. ఆమెను మరోసారి నా గుండెలకు హత్తుకుని గట్టిగా ఆమె పెదవులమీద ముద్దుపెట్టుకున్నాను. ఆమె యేమీ అభ్యంతరం చెప్పకపోవడంతో నాలో ఇంకా ఆమెను యేదో యేదో చెయ్యాలనిపించింది. కాని ఆమె నన్ను విడిపించుకొని బయటపడింది.

''ఇక్కడ కాదు, మా ఇంటికి రండి... అక్కడ మీ ప్రేమనంతా చూపెట్టండి... తప్పకుండా వస్తారుగా...''

''తప్పకుండా వస్తాను'' అన్నాను. ఆమె వెళ్లిపోయింది.

ఎప్పుడు చీకటి పడ్తుందా?

ఎప్పుడు పదిగంటలౌతుందా అని కాలుగాలిన పిల్లిలా తిరుగసాగాను. ఈ విషయం ఎవరితోనూ చెప్పలేదు... ఫలానా రాధ రమ్మంది... వెళ్లనా? అని స్వామిని అడుగుదామను కున్నాను. బోడి వెధవ... వాడినేమిటి అడిగేది అనిపించింది... రాధ రమ్మంది...

తప్పకుండా రమ్మంది. లవ్ ఎట్ ఫస్ట్ సైట్! రాధను చూడగానే ప్రేమించేశాను... (ఆశ్చర్యం! రాధను నిజంగానే ప్రేమించానని నమ్మటం మొదలెట్టాను) రాధ కూడా అంతే! నన్ను చూడగానే ప్రేమించేసింది. అందుకే అంత ప్రేమగా వాళ్లింటికే రమ్మని ఆహ్వానించింది... ఎప్పుడు వెళదామా? ఎప్పుడు అనాఘ్రాత పుష్పంలా తనకోసం ఎదురుచూస్తున్న రాధ అందాన్ని జుర్రుకుందామా? అని నా హృదయం ఆక్రోసించింది.

ఎనిమిదింటికే భోజనం చేసి బయటపడ్డాను - పల్లెటూళ్లో తొమ్మిదింటి వరకే ఊరంతా సద్దుమణిగిపోతోంది. పదిగంటలదాకా కాస్సేపు మా ఊరి శివాలయంలో కూర్చున్నాను. పదిగంటలు కాగానే హరిజనవాడవైపు బయల్దేరాను... నేను చేస్తున్న పనిలో యేదైనా ప్రమాదం ఉందని కాని, యేదో పొరపాటు చేస్తున్నానని గాని నాకనిపించలేదు. ఆమె రమ్మంది... తప్పకుండా రమ్మంది... ఇంట్లో ఎవరూ లేరంది... ఈ మాటలే నా చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆమె తన అందమంతా నాకు అర్పించటానికే పిలిచిందన్న విషయంలో నాకెలాంటి సందేహం కలుగలేదు.

ఊరికి కొంచెం దూరంలో హరిజనవాడ. చంద్రుగాడి ఇల్లు ఎక్కడో నాకు తెలుసు... హరిజనవాడంటే ఎంత భయంకరంగా వుంటుందో కూడా నాకు తెలుసు. ముక్కుపుటాల్ని బద్దలుకొట్టే దుర్గంధం... ఎక్కడ చూసినా కాలు పెట్టడానికి వీల్లేని అశుద్ధ పెంటకుప్పలు... పశువుల బొమికలు... చర్మాలు... మైగాడ్! అలాంటి ప్లేస్‌కి నేనెలా వెళ్లానో ఇప్పుడు తలుచుకుంటే నా గుండెలు అవిసిపోతున్నాయి. ఇందుకేనేమో లవ్ యీజ్ బ్లైండ్ అన్నారు.

హరిజనవాడలో అంతా గాఢనిద్రలో ఉన్నారు. ఎండాకాలం కాబట్టి చాలామంది బయటే పడుకున్నారు.... యెవరైనా లేస్తారేమోనని భయమేసింది. రాధ ఇంటి ముందుకు రాగానే ఓ కుక్క భౌమని అరిచింది. నా గుండెలు కొన్ని క్షణాలసేపు ఆగిపోయాయి. ఆ తర్వాత ఎవరో ఖంగుమని దగ్గారు. వెంటనే పారిపోదామనిపించింది. పారిపోవటానిక్కూడా నా కాళ్లు నా శరీరం సహకరించవని నాకు తెలుసు.

రాధ ఇంటిముందు నిల్చుని తలుపు తట్టాను. లోపల్నుంచి 'రండి... తలుపు తీసేవుంది' అన్న రాధ మృదువైన కంఠం నా ప్రాణాలు లేచివచ్చాయి. వెయ్యి ఏనుగుల బలం వచ్చేసింది. తలుపు తెరుచుకుని లోపలికెళ్లాను. లోపల రాధ తెల్లచీరె... తెల్ల జాకెట్... తలలో మల్లెపూలు... మల్లెపూల వాసన మత్తుగా... హాయిగా... ఏదో మరో ప్రపంచపు మధురిమలా నన్నేదో పారవశ్యం ఆవరిస్తోంది. మంత్రముగ్ధుడిలా ఆమె దగ్గరకు... ఆమె నా గుండెల మీద వాలిపోయింది. ''వచ్చారా? నా కోసం వచ్చారా? చాలా సాహసం చేసారండి'' అంది రాధ. ఆమె మాటలు నాకేదో కలలో వినిపించినట్టుగా వినిపిస్తున్నాయి. ఆమె ఎవరో దేవకన్యలా కనిపిస్తోంది. ఆమెతోపాటు ఆ ఇరుకు గదిలో వేసి ఉన్న ఓ మంచంవైపు నడిచాను. ఆమెను నా గుండెలకు హత్తుకుంటున్నాను. ఇద్దరమూ ఆ మంచంలో పడిపోయాము. నా చేతులు ఆమె శరీరంమీద దేనికోసమో వెతుకుతున్నాయి. ఆమె దేనికీ అడ్డు చెప్పటం లేదు. ఆమె పెదవులను కసిగా ముద్దుపెట్టుకున్నాను.

ఇంతలో ఏదో జరిగింది. నా కల కరిగిపోయింది. కొన్ని క్షణాల వరకు యేం జరుగుతున్నదో నాకేమాత్రం కూడా అర్థం కాలేదు.

బయట ఎవరో "రాధీ! రాధీ!" అని గట్టిగా పిలిచారు.

"అరె... మా అన్నొచ్చాడే..." అంటూ రాధ బయటకెళ్లింది.

"రాధీ! ఎవడే లోపల..." అంటున్నాడు రాధ అన్న.

రాధ కాస్సేపు మాట్లాడలేదు.

"ఎవడే లోపల?" మరోసారి అతడు గద్దించి అడిగాడు.

"అతడూ నేనూ ప్రేమించుకున్నాం" అంటోంది రాధ.

"అయితే... పెళ్లి చేసుకోకుండా యేమిటీ నాటకం..."

"పెళ్లి కూడా చేసుకుంటానన్నాడు" రాధ.

"పెళ్లి కూడా చేసుకుంటానన్నాడా? అయితే ఇప్పుడే, ఈ క్షణమే... చాలా బ్రహ్మాండమైన ముహూర్తం... ఇప్పుడే మీ కిద్దరకూ పెళ్లి చేయిస్తాను"

నా పైప్రాణాలు పైనే పోయాయి. ఏమిటిది? యేదో కుట్ర! యేదో దగా! యేదో మోసం!

బయట రాధ అన్నయ్య. వాని పేరేమిటో నాకు తెలియదు. హరిజనవాడలో అందర్నీ లేపుతున్నాడు.

"వరే పుల్లన్నా... మల్లన్నా... నర్సయ్య తాతా... రామయ్య మామ... మా రాధకి పెళ్లి సేద్దాం రండి... వసే నర్సక్క... రామక్క... అంతా రండే...!"

అక్కడ క్షణంలో పెద్ద సందడి... కోలాహలం... మొత్తం హరిజనవాడంతా ఒక్క క్షణంలో లేచి కూర్చుంది.

"యేమిట్రా... రాధి పెళ్లా? పెళ్లి కొడుకెవరు?" ఎవరో అడుగుతున్నారు.

"మన సర్పంచ్ కొడుకు శ్రీధర్ మా రాధిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని మాటిచ్చాడు. ఇప్పుడు రాధ వట్టి మనిషి కూడా కాదు."

"వెంటనే ఇప్పుడు శివుని గుళ్ళో పెళ్లి చేద్దాం - డప్పులు కొట్టండి.... బాపనాయన్ని తీసుకురండి... బ్యాండువాళ్లను పిలవండి..."

నాలో భయం, అవమానం, ఆవేశం... నా తల పగిలిపోతోందేమోననిపించింది... రాధ చాలా బ్రహ్మాండమైన ఉచ్చు పన్నింది. ఫూల్ లాగా నేనొచ్చి ఆ ఉచ్చులో చిక్కుకున్నాను... ఈ ఉచ్చులోనుంచి ఎలా బయటపడాలి? మా నాన్నెక్కడున్నాడు?.... నన్నీ రాక్షసుల బారినుండి రక్షించగల్గేది మా నాన్నొక్కడే... కాని మా నాన్నెక్కడ?

బయట డప్పులు మ్రోగుతున్నాయి.... జనమంతా "రాధమ్మ పెళ్లి... రాధమ్మ పెళ్లి"

అని కేకలు పెడ్తున్నారు. ఎవరో ''చంద్రయ్యను పిల్చుకురండి'' అంటున్నారు.

''బయటకు రావయ్యా పెళ్లికొడకా?'' అని నర్సిగాడు నన్ను బయటకు పిలిచాడు.

వెర్రివాడిలా బయటకు నడిచాను. ''మీలాంటి గొప్పోరు... మా ఇండ్లకొచ్చి మా పిల్లను నేసుకున్నారంటే మీరు నిజంగా గొప్పోరు దొరా?''

నా గొంతు పెగల్లేదు... నేనేమీ మాట్లాడలేదు. నా నవనాడులు కృంగిపోయాయి... నాలో యేదో పిరికితనం... దొంగతనం చేస్తూ దొరికిపోయాను... అందుకు ఇంత ఘోరమైన శిక్ష? రాధను పెళ్లి చేసుకోవాల్సిందేనా?

రాధ అన్నయ్యొచ్చాడు... అతని వెంట ఓ బ్రాహ్మడు... అతని చేతిలో మంగళ సూత్రం!!! అక్కణ్ణించి నా శరీరంలోని శక్తినంతా కూడదీసుకుని పారిపోవాలనుకున్నాను. కాని... కాని... నా కాళ్లు భూమిలో కూరుకుపోయాయి. కదల్లేను...

''రండి బావగారూ... మీ ఇద్దరికి శివుని గుళ్ళో పెళ్లి చేసేస్తాం... రండి...''

''నేనెప్పుడూ మీ చెల్లెల్ని పెళ్లి చేసుకుంటానని అనలేదే?'' అన్నాను చివరకు తెగించి.

''పెళ్లి చేసుకుంటాననలేదు... ప్రేమించానని అనలేదు... అయితే మా ఇంటికెందు కొచ్చారు... నాతో ఇన్నాళ్లుగా ఎందుకు కులుకుతున్నారు...'' రాధ నిలదీసి అడిగింది.

''చూశారా, చూశారా? రాధను ప్రేమించాను. పెళ్లి చేసుకుంటానని మాటిచ్చి, రాధను అనుభవించి ఇప్పుడు... పెళ్లి చేసుకుంటానన్నానా? అంటున్నాడు... మొఖానికి సిగ్గులేదు... మీలాంటి డబ్బున్నవాళ్లు పేదవాళ్ల జీవితాలతో చెలగాటమాడే రోజులు పోయాయి శ్రీధర్‌గారూ! పెళ్లి చేసుకోకుండానే మా రాధతో ఏం చేద్దామని మా ఇంటికొచ్చారు?

నన్ను నగ్నంగా నిల్చోబెట్టి వాళ్లంతా కొరడాలతో కొడ్తున్నట్టుగా ఫీలయ్యాను... వాళ్లకు నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను... నిజంగానే రోజులు మారాయి. రాధ శీలంతో ఆడుకోవచ్చుననుకున్నాను. మాదిగ కులంలో పుట్టినదానికి శీలమేమిటనుకున్నాను. కాని నాకు వీళ్లు భలేగా బుద్ధిచెప్పారు.

''పదండెహే... శివుని గుడికి పదండెహే'' అన్న కేకలు మిన్నుముట్టాయి. క్షణంలో ఎక్కన్నుంచో కొత్త బట్టలొచ్చాయి. నాకు, రాధకు కొత్త బట్టలు కుట్టించారు. దేనికి అడ్డం చెప్పే సాహసంగానీ, నైతిక బలంగానీ నాలో మచ్చుకైనా లేకుండా పోయాయి. ఎవరో వెళ్లి ఆ ఊళ్లోనే ఉన్న బ్యాండువాళ్లను లేపుకొచ్చారు. డప్పుల మోతలు... బ్యాండువాళ్ల చప్పుళ్లు... ఎవరో చాకలివాళ్ల దగ్గరికెళ్ళి పల్లకి తెచ్చారు. రాధ, నేను పల్లకీలో కూర్చున్నాము. శివుని గుడికి వెళ్లాం. పురోహితుడు మంత్రాలు చదివాడు. నేను యంత్రంలాగా అతడు చెప్పిన పనులన్నీ చేశాను. రాధ మెడలో తాళి కట్టాను. ఎవరో వెళ్లి మా నాన్నకు ఈ విషయం చెప్పారు. మా నాన్న పరుగెత్తుకుని వచ్చాడు. అప్పటికే అంతా అయిపోయింది. మా నాన్న

పిచ్చెత్తినట్టుగా అరిచాడు. హరిజనులందర్నీ బూతులు తిట్టాడు. ఇది పెళ్లి కాదన్నాడు. కోర్టు కెడ్తానన్నాడు. నన్ను కూడా నోటికొచ్చినట్లు తిట్టాడు - మీదపడి కొట్టబోయాడు - కాని అందరూ అతన్ని ఆపేశారు. ''నా ఇంటి గడప తొక్కితే తుపాకితో కాల్చిపారేస్తా'' నన్నాడు. అందరూ కలిసి మా నాన్నను బలవంతంగా అక్కణ్ణించి తీసుకెళ్ళారు. ఈ విషయం తెలిసినప్పుడు మా అమ్మ పరిస్థితి ఎలా ఉందో ఊహించలేకపోయాను - తర్వాత తెలిసింది. ఈ విషయం తెలియగానే మా అమ్మ పెద్దగా అరిచి మూర్ఛపడిపోయిందట!...

ఆ తెల్లారే రాధా నేను కలిసి వరంగల్‌కు వెళ్లిపోయాము.

మేం వరంగల్‌కు బయల్దేరేముందు రాధ వాళ్ళ అన్నయ్య చెప్పాడు.

''నిన్న మీ మామిడితోటలో మీరు కలుసుకున్న విషయం మా రాధ చెప్పగానే మీకిద్దరికీ వెంటనే పెళ్ళి చెయ్యాలని నిర్ణయించాం - నువ్వు మా రాధిని యిష్టంతోటే చేసుకున్నావో లేక బలవంతంగా మేం చేశాం కాబట్టి చేసుకున్నావో.... అదంతా ఇప్పుడనవసరం.. ఎలాగయితేనేం మీ పెళ్ళి జరిగిపోయింది. మీరిద్దరిప్పుడు భార్యాభర్తలు... మీ నాయనో మీ అమ్మో వచ్చి ఈ పెళ్ళి నిజమైన పెళ్ళి కాదని... నీకు మళ్ళీ పెళ్ళి చేస్తామని నిన్ను బలవంత పెట్టొచ్చు - మా రాధి నుండి నిన్ను వేరు చెయ్యాలని ప్రయత్నించొచ్చు. కానీ ఎట్టి పరిస్థితుల్లో నూ నువ్వు మా రాధిని వదిలిపెట్టొద్దు... అలాంటి పనేదైనా చేశావో... పర్యవసానాలు చాలా తీవ్రంగా వుంటాయి... నువ్వీ ప్రపంచంలో క్షేమంగా వుండాలంటే నువ్వు మా రాధితోటే బుద్ధిగా కాపురం చెయ్యాలి... తెల్సిందా? వరంగల్ లో నా మిత్రుడొకడున్నాడు - కాస్త వున్నవాడే. వాళ్ళ ఇల్లు రాధికి తెలుసు - కొన్నిరోజులు వాళ్ళింట్లో వుండండి. తొందర్లోనే మా రాధికేదన్నా ఉద్యోగం దొరుకుతుంది. నీక్కూడా దొరకొచ్చు. పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యకుండా బుద్ధిగా వుంటావుగా?''

అలాగేనన్నట్టుగా తలవూపాను. ★

'యువజన' 1979